# అమెరి'కులాసా' కథలు
## - వంగూరి చిట్టెన్‌రాజు





## అమెరికులాసా కథ – 214
## అమెరికత్తి వేటు కథ

నిజానికి ఇది కథ కాదు...అలా అని పూర్తిగా నిజంగా ఇలాగే జరగ లేదు. సగం నిజం, సగం సొంత పైత్యం అనమాట. అసలేం జరిగిందీ అంటే... ఆవిడకి ఆపరేషన్ జరిగింది. ఎందుకో తెలియదు కానీ డాక్టర్లు కోసే ఏ కత్తి కోతని అయినా అమెరికాలో ప్రొసీజర్ అంటారు. అంటే మన మెదడు లోపల ఎక్కడో కాస్త వాపుకి సగం తీసేసే పెద్ద సర్జరీ అయినా, గుండె కాయ లోపలికి వెళ్ళి, బయటకి వచ్చే పెద్ద గొట్టాలు మూసుకుపోతే అవి తెరిచి ఉంచడానికి ఆ రక్తనాళం విస్తరించే చిన్న గొట్టాలు... అంటే స్టెంట్ పెట్టాలన్నా, ఆఖరికి చెవిలో గులివి తీయాలన్నా, గోళ్ళు కత్తిరించాలి అన్నా...అన్నింటినీ మా అమెరికాలో ప్రొసీజర్ అనే అంటారు. అలాంటి ఒకానొక ప్రొసీజర్ మొన్నీ మధ్య మా క్వీన్ విక్టోరియాకి జరిగింది.

ముందుగా విషయం ఏమిటంటే...ఆ మధ్య ఆవిడకి ఇష్టం అయిన వంకాయలు కొనుక్కోడానికి ఆవిడా, నాకు కావలసిన బీర కాయలు కొనుక్కోడానికి నేనూ...కాదు..కాదు..ఆ బీర కాయలు కాదు..వండుకుని తినే నిజమైనవే...వాల్ మార్ట్ కి వెళ్ళాం. యధా ప్రకారం మైలున్నర దూరం లో కారు పార్క్ చేసుకుని వెళ్తుండగా ఆవిడ

"ఓయ్ మొగుడూ...నీ వెనకాల నడుస్తుంటే కాళ్ళు పీకుతున్నాయి. నడుం నొప్పెడుతోంది" అని సతాయించడం మొదలు పెట్టింది.

"ఓ..అలా అయితే నువ్వే ముందు నడు, నేను నీ వెనకాల పడతాను" అన్నాను సరదాగా.

"నీ మొహం.వెధవ లాజిక్కూ నువ్వూను, నా వెనకాల పడితే నీ కాళ్ళు నొప్పెడతాయి, నిఝంగానే పడతావు" అనేసి పాపం నడుం నొప్పి భరించ లేక చతికిల పడబోతే నేను ఎన్టీఆర్ అంజలీ దేవి ని ఎముకలు విరిగే లాగా, మహేష్ బాబు తమన్నా ని మాడర్న్ గా సున్నితంగానూ కాక మధ్యే మధ్యే అమెరికా పద్ధతిలో ఆవిడని పొదివి పట్టుకునే ప్రయత్నం లో ఇద్దరం కలిసి మెలిసి సామూహికంగా కింద పడబోయి...మొత్తానికి పడకుండా నిలబడగలిగాం.

అది చూసి నిర్ఘాంత పోయిన ఒకానొక వాల్ మార్ట్ కస్టమర్ చేతిలో ఉన్న బీర కాయలు జారి పడి ఆ ద్రావకం ఒలికిపోవడం, ఆ పెద్ద మనిషి ట్రంప్ గారు ఇరాన్ అయోటోలా కేసి చూసినట్టు నా కేసి తీవ్రంగా చూడడం కేవలం యాదృచ్ఛికమే!.

ఇలాంటి అలవిమాలిన నడుం నొప్పి వచ్చుటకు కారణం బెయ్యది అని విచారించాలి కదా అని "ఏమోయ్, మన పెళ్ళయినప్పుడు నువ్వు "సింహేద్ర మధ్యమ" వి కదా, తర్వాత నీ వడ్డాణం సైజు కించిత్తు పెరిగింది కదా...ఇప్పుడు నీ సరి కొత్త నడుము నొప్పికి, దానికీ లింక్ ఏమైనా ఉందా, బరువు పెరిగితివా" అని విచారించగా ఆవిడ గయ్ మని లేవబోయి, "ఏమో, ఎవడికి తెలుసు. ఎవడో ఒక వెన్నెముక డాక్టర్ ని పిలు. వాడికేమన్నా తెలుసునేమో" అని అపసోపాలు పడింది. ఇక మా అమెరికా మెడికల్ తతంగం మొదలయింది. ముందుగా ఆవిడ మెడికల్ ఇన్స్యూరెన్స్ పద్ధతి ప్రకారం ముందు మా పి.సి.పి అనగా ప్రైమరీ కేర్ ఫిజీషియన్ అనగా డా. గేట్ కీపర్ డాక్టర్ దగ్గరకి వెళ్ళి ఆయనేమంటాడో కనుక్కోవాలి. అంచేత డా. గే.కీ ఎపాయింట్ మెంట్ కోసం ఫోన్ చేశాను. ఆ ఆపరేటర్ తో నా ఈ క్రింది సంభాషణ కాస్త అతిశయోక్తిగా ఉన్నా సారాంశం ఒకటే!

"హలో డా. గే కీ గారి ఆఫీసేనా? నా పేరు వంచిరా..మా ఆవిడ పేరు క్వీన్ విక్టోరియా"..

"ఫన్నీ నేమ్స్, వాట్ ఈజ్ ద డేట్ ఆఫ్ బర్త్"

"నాదా. ఆవిడదా"

"ఎపాయింట్ ఎవరికి కావాలో వారిది కావాలి రా, గాడిదా"

"ఓ...సారీ..అలా అయితే ఆవిడదే కానీ మా అత్త గారు చెప్పిన డేటా? మామ గారు అనుకున్న డేటా?"

మా పెళ్ళి ముహూర్తం పెట్టేటప్పుడు వాళ్ళిద్దరూ కీచులాడుకున్న సంగతి గుర్తుకొచ్చింది...

"నీ తలకాయ్. డ్రైవర్ లైసెన్స్ లో ట్రంప్ గారికి చెప్పిన డేట్ చెప్పరా రాస్కెల్"

"ఓ, అదా?" చెప్పేశాను.

"ఎపాయింట్ మెంట్ దేనికి?

చెప్పొద్దూ,,ఈ చచ్చు ప్రశ్నకి నాకు ఒళ్ళు మండిపోయి "ఎందుకా? నేనూ, ఆవిడా వచ్చి ఆ డాక్టర్ తో సెల్ఫీ తీసుకోడానికి" అని చెబ్దాం అనుకుని, తమాయించుకుని "ఆవిడకి నడుం నొప్పి గా ఉంది, అందుకూ" అన్నాను.

"అలా అయితే ఆవిడతోనే మాట్లాడాలి. లేదా నీతో మాట్లాడదానికి ఆవిడ పెర్మిషన్ ఇవ్వాలి"

"ఆవిడ నాకు పెర్మిషన్ ఇచ్చి 48 ఏళ్ళు అయింది....మా పెళ్ళి నాటి ప్రమాణాలు"

"వావ్...అన్నేళ్లే...కంగ్రాట్యులేషన్స్...అయినా సరే...మేము పేషెంట్ తోనే మాట్లాడాలి. సారీ"

ఇక తప్పదురా అని ఫోన్ ఆవిడకి ఇచ్చాను.

."మీ డేట్ ఆఫ్ బర్త్? అంటూ మళ్ళీ తతంగం మొదలు. ఈ సారి కొంచెం లెవెల్ పెరిగింది.

"నడుం నొప్పి ఎక్కడా?

"నీ మొహం. నడుం నొప్పి అంటే నడుం దగ్గర..తల దగ్గర కాదు. ఆ మాత్రం తెలీదా?"

"ఐ నో…కేవలం నడుం దగ్గరేనా, కాళ్ళు కూడా నొప్పెడుతున్నాయా అని నా ఉద్దేశ్యం" కొంచెం అదోలా

"అవును తల్లీ, నడుం దగ్గర మొదలెట్టి నాలుగు అడుగులు వెయ్యగానే కాళ్ళు లాగుతాయి"

"ఇలాంటిది మీ బామ్మ, అమ్మమ్మ, తాతయ్య, మేనత్త కొడుకు___.ఇలా మీ వంశం లో ఎవరికైనా ఉందా?

"ఏమో ఎవడికి తెలుసు..కనుక్కోడానికి కుదరదు. పైన ఎక్కడో ఉన్నారు.. ముందు నా సంగతి చూడు. ఇంతకీ ఎపాయింట్ మెంట్ ఇస్తావా, చస్తావా?

"ఒకే…ఇంతకీ మీ నొప్పి లెవెల్ ఎంత…ఆన్ ఎ స్కేల్ ఆఫ్ వన్ టు టెన్.."

అమెరికాలో ఏ డాక్టర్ దగ్గరకి ఎందుకు వెళ్ళినా అడిగే ఈ ప్రశ్న వినగానే ఒళ్ళు మండిపోతుంది. ఒక సారి నాకు భలే కోపం వచ్చి ఆ నర్సమ్మని "నిన్ను ఒక సారి గిల్లుతాను. నీకు ఎంత నొప్పి వచ్చిందో చెప్ప గలవా..ఆన్ ఎ స్కేల్ ఆఫ్ ఒన్ టు టెన్" అనగానే ఆ పిల్ల హడిలిపోయి పారిపోయింది. ఈ గిల్లుడు ప్రపోజల్ కి భయపడి ఆ డాక్టర్ నాకు ఎపాయింట్ మెంట్లు ఇవ్వడం మానేశాడు.

మొత్తానికి ….ఎలాగైతేనేం మా డా. గే కీ ని చూడడం, ఆయన ఆవిడని వెన్నెముక స్పెషలిస్ట్ దగ్గరకి పంపడం, ఆయన

తనకి కావలసిన చిన్న ఫొటోలు….అంటే….కేట్ స్కాన్, పెద్ద ఫొటోలు..అంటే ఎమ్మారై లు తీయించుకుని ఈ నడుం నొప్పి రావడానికి కారణాలు నిర్ధారణ చేయడం జరిగింది. వెన్నెముకలో అట్టడుగున ఉండే L4, L5 అనే రెండు "కశేరుకలు".. అరిగిపోయి, పక్కనే ఉన్న పెద్ద నరాన్ని ముద్దెట్టుకుంటే వచ్చే ఆ నొప్పి తగ్గించడానికి సర్జరీ చేయించుకోమని సలహా ఇచ్చి ఆయన చేతులు దులిపేసుకున్నాడు. ఈ సర్జరీ అనబడే ప్రొసీజర్ అనబడే ఆపరేషన్ నిజానికి రెండు గంటలే కానీ మా ఆసుపత్రి వాళ్ళకి ఆవిడ మీద అపారమైన ప్రేమ పుట్టుకొచ్చేసి వారం రోజులు అక్కడ కాపరం పెట్టించారు. ఇప్పుడు అంతా సద్దుకుని మా రోజు వారీ ప్రొసీజర్లకి వచ్చేశాం. అంటే వంటింట్లో ఆవిడ చిన్న కత్తులతో కూరగాయలు తరగడం, నేను మాతోటలో కొడవలి తో గడ్డి కొయ్యడం….ఇలా అత్యంత ఆసక్తికరమైన మా అమెరికా జీవితానికి వచ్చేశాం. మా ఇంట్లో ప్రొసీజర్స్ కి మాత్రం ఇన్స్యూరెన్స్ వాడు డబ్బు ఇవ్వడు. ఏం చేస్తాం?

**COMMENTS**